గడువు పొడిగింపు

సూర్యాపేట కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకం కింద ఎస్సీ విద్యార్థులు విదేశాల్లో ఉన్నత చదువులకు ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 29 వరకు గడువు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి కె.లత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు https:///telanganaepass.gov.in వెబ్‌సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యాదాద్రిలో సంప్రదాయ ఆరాధనలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

యాదగిరిగుట్ట, న్యూస్‌టుడే: యాదాద్రిలో మంగళవారం పంచ నారసింహులకు నిత్య ఆరాధనలతో పాటు క్షేత్ర పాలకుడైన ఆంజనేయ స్వామిని కొలిచే ప్రత్యేక పూజలు ఆలయ ఆచారంగా కొనసాగాయి. గర్భాలయంలోని మూలవరులకు గోవుపాలతో నిజాభిషేకం, తులసీ దళాలతో అర్చన నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఆకు పూజ చేపట్టారు. వేకువజామున సుప్రభాతం చేపట్టిన పూజారులు గర్భాలయంలో కొలువుదీరిన స్వయంభువులను హారతితో కొలిచారు. దర్శన మూర్తులను బంగారు పుష్పాలతో ఆరాధించారు. ఆలయ మండపంలో స్వర్ణ పుష్పార్చన, అష్టభుజి మండపంలో శ్రీ సుదర్శన నారసింహ హోమం, శ్రీ లక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణం నిర్వహించారు. అలంకార మూర్తులను గజ వాహనంపై అలంకృతులను చేసి సేవా పర్వాన్ని జరిపారు. సాయంత్రం అలంకార జోడు సేవోత్సవం చేపట్టారు. రాత్రి వేళ గర్భాలయంలో ప్రత్యేక ఆరాధన, సహస్రనామార్చన నిర్వహించారు. ఉపాలయంలో క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి వేద, మంత్రాలతో తమలపాకులతో అర్చన జరిపారు. ఆర్జిత కైంకర్యాన్ని విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయ స్వామికి ఆకుపూజ నిర్వహించారు. సహస్ర నామార్చన జరిపారు. పాతగుట్టలోనూ శ్రీ లక్ష్మీ నరసింహస్వామి నిత్యపూజలు, పుష్కరిణి వద్ద ఆంజనేయ ఆరాధన తమలపాకులతో నిర్వహించారు. కొండపైన శివాలయంలో పార్వతీ పరమేశ్వరుల ఆరాధనలను ఆలయ ఆచారంగా కొనసాగించారు. మంగళవారం వివిధ విభాగాల ఆలయ ఖజానాకు రూ. 21,99,248 చేకూరింది.

నల్గొండకు మహర్దశ

- రూ.516 కోట్లతో బైపాస్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం అనుమతి
- తప్పనున్న ట్రాఫిక్ ఇక్కట్లు



బైపాస్‌గా విస్తరించనున్న హౌసింగ్‌బోర్డుకాలనీ రోడ్డు

నల్గొండ జిల్లా పరిషత్తు, న్యూస్‌టుడే:


నల్గొండ, సూర్యాపేట జిల్లాల ప్రజలు, వ్యాపారుల కల నెరవేరనుంది. జాతీయ రహదారి-565లో నకిరేకల్-నాగార్జునసాగర్ మార్గంలో నల్గొండ పట్టణం వద్ద బైపాస్ రోడ్డు నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. మహారాష్ట్రలోని సిరోంచ నుంచి మొదలు వయా నకిరేకల్, నల్గొండ, నాగార్జున సాగర్ మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని మాచర్ల, ఎర్రగొండపాలెం, కనిగిరి, చిత్తూరు వరకు జాతీయ రహదారి నెంబరు 565 నిర్మిస్తున్న విషయం తెలిసిందే. మూడు రాష్ట్రాలను అనుసంధానిస్తూ నిర్మిస్తున్న ఈ జాతీయ రహదారిలో నల్గొండ పానగల్ కూడలి నుంచి 14 కి.మీ మేర నాలుగు వరసల బైపాస్ రహదారి నిర్మాణానికి రూ. 516 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు సోమవారం కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఎక్స్ వేదిక ద్వారా ప్రకటించారు. బైపాస్ నిర్మాణంతో వాహనదారులకు మరింత రవాణా సౌకర్యం మెరుగు పడనుంది.

మారనున్న రూపురేఖలు

ఆంధ్రప్రదేశ్-తెలంగాణ రాష్ట్రాల అనుసంధానికి జాతీయ రహదారి-565 కీలకమైనది. ఈ దారిలో నాలుగు వరసల బైపాస్ నిర్మాణంతో నల్గొండ రూపురేఖలు మారనున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే పట్టణంలో వాహనాల రద్దీ తగ్గడంతో పాటు ట్రాఫిక్ సమస్య తీరనుంది. నల్గొండ, చండూరు, మునుగోడు, కనగల్, గుర్రంపోడు, కొండమల్లేపల్లి, మాల్, సంస్థాన్ నారాయణపురం మండలాలకు రవాణా సౌకర్యం మరింత సులువుకానుంది. నకిరేకల్-నాగార్జున సాగర్ దారిలో సురక్షితమైన ప్రయాణానికి దోహదం చేస్తుంది. నల్గొండ పురపాలిక పరిధిలో వెనుకబడిన ప్రాంతాలైన పాతబస్తీ, మామిళ్లగూడ, మర్రిగూడ, పానగల్, కతాలగూడ ప్రాంతాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

నాలుగు వరసల రోడ్డుకు ప్రతిపాదన ఇలా..

నకిరేకల్-మాచర్ల సెక్షన్ పరిధిలో నల్గొండ పట్టణంలో గత పదేళ్లుగా జాతీయ రహదారి విస్తరణ పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి కేంద్ర ప్రభుత్వానికి వ్యాపారులు మొర పెట్టుకున్నా ఆలకించే వారు కరవయ్యారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రిగా కోమటిరెడ్డి వెంకటరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి రూ. 700 కోట్ల ప్రతిపాదనలతో బైపాస్ రోడ్డు నిర్మించాలని కోరిన విషయం విదితమే. మంత్రి అభ్యర్థన మేరకు కేంద్ర ప్రభుత్వం బైపాస్ రోడ్డు నిర్మాణానికి ఫిబ్రవరిలో పచ్చజెండా ఊపింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బైపాస్ నిర్మాణానికి మూడు మార్గాలను గుర్తించి కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనల పంపించారు. అందులో పానగల్ ఛాయా సోమేశ్వరస్వామి ఆలయం నుంచి వయా పానగల్, మర్రిగూడ మీదుగా హౌసింగ్‌బోర్డుకాలనీ, సంతోష్‌నగర్, కతాలగూడ, గంధవారిగూడెం, ఎస్ఎల్‌బీసీ మెడికల్ కళాశాల వరకు 14 కి.మీ. మేర నాలుగు వరసల బైపాస్ రోడ్డు ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. రోడ్డు అలైన్‌మెంటు విడుదల కావడంతో నిర్మాణ పనులకు అవసరమైన కసరత్తు ప్రభుత్వ యంత్రాంగం చేపట్టింది. భూసేకరణకు అవసరమైన సర్వే ఇప్పటికే ప్రారంభమైంది. రెవెన్యూ అధికారులు ఎనిమిది కి.మీ మేర సర్వే పూర్తి చేశారు.



ప్రతిపాదిత రోడ్డు

తెగులు సోకిన పంటల పరిశీలన

నడిగూడెం, న్యూస్‌టుడే: వాతావరణ పరిస్థితుల వల్ల తెగులు సోకే అవకాశం ఉన్నందున రైతులు ముందస్తు చర్యలు చేపట్టాలని కోదాడ వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎల్లయ్య రైతులకు సూచించారు. 'వరికి తాటాకు తెగులు' శీర్షికన మంగళవారం ప్రచురించిన కథనానికి వ్యవసాయ అధికారులు స్పందించారు. రామాపురం పరిసరాల్లో తెగులు సోకిన వరి పైర్లను పరిశీలించి రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. తెగులు నివారణకు పిప్రోనిల్ 300 ఎంఎల్, ఇమిడాక్లోప్రిడ్ కలిసి ఉండే మందును ఎకరాకు 100 ఎంఎల్ చొప్పున పిచికారీ చేయాలని సూచించారు. పైరుకు తెగులు ఆశించకుండా కాసుకోమైసిన్ 400 గ్రాములు పిచికారీ చేసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులు, అధిక నత్రజని వాడకం వల్ల తెగులు ఆశిస్తున్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఏవో ఆర్.దేవప్రసాద్, ఏఈవోలు పిచ్చయ్య, ఉప్పయ్య, రేణుక, రైతులు పాల్గొన్నారు.

మొదటి రోజు సుదీర్ఘ విచారణ

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూమిని అక్రమంగా ఇతరుల పేర్ల మీదకు మార్పిడి, రైతుబంధు నిధుల దుర్వినియోగం కేసులో అరెస్టయిన గత హుజూర్‌నగర్ తహసీల్దార్ జయశ్రీని, ధరణి ఆపరేటర్ జగదీష్‌ను మంగళవారం సుదీర్ఘంగా విచారించారు. పోలీసులు తహసీల్దార్ జయశ్రీని, ధరణి ఆపరేటర్ జగదీశ్‌ను మూడు రోజులు కోర్టు అనుమతితో తమ కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్న విషయం తెలిసిందే. మొదటి రోజు పంచుల సమక్షంలో సీఐ చరమందరాజు ప్రశ్నించారు. జరిగిన వ్యవహారంలో రికార్డు పరమైన సాక్ష్యాలను సేకరించడంపై పోలీసులు దృష్టి సారించినట్లు తెలిసింది. తహసీల్దార్ జయశ్రీ ఆరోగ్యం బాగోలేదని, ఆయాసం వస్తుందని, తనకు కొంత సమయం ఇవ్వాలని మాత్రమే చెబుతూ వచ్చినట్లు సమాచారం. ఆమె నుంచి మరింత సమాచారం రాబట్టడానికి మరింత సమయం పడుతుందని పోలీసులు అంటున్నారు.

14 మందికి ఎస్సైలుగా పదోన్నతులు

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో పని చేస్తున్న 14 మంది ఏఎస్సైలకు ఎస్సైలుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. ఈ మేరకు పదోన్నతి పొందిన వారికి మూడు నెలల పాటు ఈనెల 21 నుంచి జనవరి 13 వరకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు. పదోన్నతులు పొందిన వారు బుధవారం ఎస్పీ కార్యాలయంలో రిపోర్ట్ చేయనున్నారు.

ఎంపికైన వారు	పని చేస్తున్న పోలీస్‌స్టేషన్
ఎ. సైదులు	నేరేడుచర్ల
పి. వెంకటేశ్వర్లు	కోదాడ టౌన్
బి. ఆనంద్ నాయక్	మఠంపల్లి
వి. వెంకటయ్య	నాగారం
ఎండి. ఇస్మాయిల్	కోదాడ గ్రామీణం
ఎల్. పాండునాయక్	సూర్యాపేట గ్రామీణం
ఎం. సైదయ్య	ఇంటిలిజెన్స్
కె. వెంకటేశ్వర్లు	కోదాడ ట్రాఫిక్
వి. వెంకన్న	సూర్యాపేట-1
పి. ముత్తయ్య	సూర్యాపేట-2
బి. హనుమాన్	సూర్యాపేట(డీఎస్‌బీ)
జి. చినమల్సూర్	నడిగూడెం
ఎస్‌కె. రహీముద్దీన్	సూర్యాపేట గ్రామీణం
బి. రామచంద్రం	సీసీఎస్, సూర్యాపేట

'ధరల నియంత్రణలో కేంద్రం విఫలం'



సూర్యాపేటలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

కుడకుడరోడ్డు(సూర్యాపేట), న్యూస్‌టుడే: దేశంలో నిత్యావసర ధరలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని ఎం.వి.ఎన్.భవన్‌లో మంగళవారం నిర్వహించిన పార్టీ జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసర ధరలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన ఆందోళన కార్యక్రమాలను జిల్లావ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ధరల పెరుగుదలతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ కాల్వలపై నివాసముంటున్న పేదలకు ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసిన తర్వాతే వారి ఇళ్లను కూల్చివేయాలని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపెల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, తదితరులు పాల్గొన్నారు.

నల్గొండలో 20 నుంచి రాష్ట్రస్థాయి చేనేత ప్రదర్శన

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: ఈ నెల 20 నుంచి నవంబరు 2వ తేదీ వరకు నల్గొండలోని తితిదే కల్యాణమండపంలో రాష్ట్రస్థాయి చేనేత ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు జిల్లా చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు ద్వారక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 50 నుంచి 60 చేనేత సహకార సంఘాలు వివిధ రకాల ఉత్పత్తులతో ప్రదర్శన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గాలికుంటు నుంచి పశువులను కాపాడుకోండి

నాగారం, న్యూస్‌టుడే: గాలికుంటు వ్యాధి భారీ నుంచి పాడి రైతులు తమ పశువులను కాపాడుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ డి.శ్రీనివాసరావు సూచించారు. వర్ధమానుకోటలో మంగళవారం పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పశువైద్య శిబిరానికి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాల ప్రాధాన్యతను రైతులకు వివరించారు. జిల్లా సహాయ సంచాలకుడు బి.వెంకన్న, తుంగతుర్తి సహాయ సంచాలకుడు డాక్టర్ బి.రవిప్రసాద్, నాగారం, జాజిరెడ్డిగూడెం మండలాల పశువైద్యాధికారులు బత్తుల రవి, బి.అర్జున్, జేవీవో నాగరాజు, ఎల్ఎస్ఏటీ మురళి, గోపాలమిత్ర లింగమల్లు, రైతులు పాల్గొన్నారు.



జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రైతులు

సంత.. దళారుల సొంతం..!



షెడ్లలో పశువులున్న ఈ చిత్రం కోదాడ సంతలోనిది. కొందరు దళారులు వీటిని ఇంట్లో కాకుండా సంతలోనే పెంచుతున్నారు. షెడ్లలో పశువులు ఉండటంతో రహదారి మీద జీవాల విక్రయాలు జరుగుతున్నాయి. వర్షాకాలం, ఎండాకాలం నీడ లేకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. సరైన స్థలం లేకపోవడంతో ఏటా క్రయవిక్రయాలు తగ్గిపోతున్నాయి.

- షెడ్లలో పశువుల పెంపకం
- నోటీసులు ఇచ్చినా స్పందించని వైనం

పరిశీలన

కోదాడ, న్యూస్‌టుడే:

కోదాడ అనగానే మొదటగా గుర్తొచ్చేది పశువుల సంత. ఉమ్మడి రాష్ట్రంలోనే ఓ వెలుగు వెలిగిన సంత నేడు మసకబారుతోంది. గతంతో పోల్చుకుంటే పశువుల విక్రయాలు 50 శాతానికి పైగా పడిపోయాయి. కోదాడకు ఆనుకొని ఉన్న సూర్యాపేట, మిర్యాలగూడ సంతలు ఏటా అభివృద్ధి చెందుతుంటే, కోదాడలో మాత్రం దిగజారిపోతోంది. దళారుల రాజ్యం నడుస్తుండటం, అధికారులు చూసీచూడనట్లు ఉండటంతో సంత ఆదరణకు నోచుకోవడం లేదు.

క్రయవిక్రయాలకు ఇబ్బందులు

ప్రతి శనివారం సంత నడుస్తుంది. పశువులు, మేకలు, గొర్రెల క్రయవిక్రయాలు జరిగిన తర్వాత అదే రోజు సంతను ఖాళీ చేయాలి. కొందరు దళారులు సంత షెడ్లలో పశువులను పెంచుతున్నారు. అక్కడే గడ్డివాములు వేశారు. అక్కడి షెడ్లలో సుమారు 25 మంది దళారులు అక్రమంగా తమ పశువులను పెంచుతున్నారు. వీరిలో ప్రజాప్రతినిధులు ఉండటం విశేషం. రాజకీయ పలుకుబడి ఉపయోగించి, అధికారులను లెక్క చేయట్లేదనే ఆరోపణలు ఉన్నాయి. పరిసరాలను శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వచ్చి రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారు. రైతుల మేలు కోసం ఏర్పాటు చేసిన సంతలో ఇలా పశువులను పెంచడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా దళారులను బయటికి పంపి కోదాడ సంతకు పూర్వ వైభవం తీసుకొచ్చేలా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని రైతులు కోరుతున్నారు.

పలుమార్లు చెప్పాం

సంతలోని షెడ్లలో పశువులను పెంచుతున్న వారిని గుర్తించి అందరికీ మొదటి దఫా నోటీసులు జారీ చేసినా స్పందన లేదు. మరోసారి నోటీసులు జారీ చేసి, ఉన్నతాధికారుల సూచన మేరకు చర్యలు చేపడతాం. రైతుల సౌకర్యార్థం షెడ్లను ఖాళీ చేయాలని ఇప్పటికే పలుమార్లు వారికి తెలియజేశాం. ఇప్పటికైనా షెడ్లను ఖాళీ చేసి, సంత అభివృద్ధికి సహకరించాలి.

– రాహుల్, వ్యవసాయ మార్కెట్ కార్యదర్శి, కోదాడ

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికకు కమిటీలు

- పంచాయతీలు, పురపాలికల్లో నియామకానికి కసరత్తు

నల్గొండ కలెక్టరేట్, న్యూస్‌టుడే:

నిరుపేదలకు సొంతింటి కలను సాకారం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయించనుంది. ఈ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులకు మూడు దశల్లో రూ.5 లక్షలు చెల్లిస్తారు. దీని కోసం ప్రత్యేకంగా గ్రామాలు, పట్టణాల్లో ఇందిరమ్మ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. వీటిలోని సభ్యులు, అధికారులు సంయుక్తంగా లబ్ధిదారులను గుర్తిస్తారు. ఇందిరమ్మ కమిటీల నియామకానికి అధికారులు గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు నిర్వహిస్తున్నారు.

వీరికి స్థానం

నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో 12 నియోజకవర్గాలు, 1784 గ్రామ పంచాయతీలున్నాయి. తొలి విడతలో భాగంగా జిల్లాకు 42 వేల ఇళ్లు మంజూరు చేస్తారు. గ్రామ పంచాయతీలు, పురపాలికల్లో వార్డు కమిటీల నియామకానికి అధికారులు కార్యాచరణ చేపట్టారు.

★ గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసింది. దీంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది. సర్పంచుల స్థానంలో ప్రత్యేకాధికారికి ఇందిరమ్మ కమిటీల్లో చోటు కల్పించారు. ఇద్దరు మహిళా సంఘాల సభ్యులు, ముగ్గురు గ్రామస్థులు బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున, పంచాయతీ కార్యదర్శి గ్రామ కమిటీల్లో భాగస్వాములవుతారు.

★ పురపాలక సంఘాల పరిధిలో వార్డు కౌన్సిలర్, ఇద్దరు మహిళా పొదుపు సంఘాల సభ్యులు, బీసీ, ఎస్సీ, ఎస్టీల్లో ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు. ఎవరైనా అనర్హులు ఎంపికై బిల్లులు తీసుకుంటే వారిపై ఫిర్యాదు చేసి నిధులు రాబట్టే అధికారం వీరికి ఉంటుంది.



కమిటీల్లో సభ్యులు

ఉమ్మడి జిల్లాలో గ్రామ పంచాయతీలు: 1784	ఒక్కో గ్రామ కమిటీలో సభ్యులు: ఏడుగురు
మొత్తం సభ్యులు: 12,488 మంది	పురపాలికలు: 17
365 వార్డుల్లో కమిటీ సభ్యులు: 2,555 మంది	

నిబంధనలు ఇలా..

- కమిటీ సభ్యులు పేద, మధ్య తరగతి వారై ఉండాలి.
- జాతీయ ఆహార భద్రత కార్డు తప్పనిసరి.
- అద్దె ఇళ్లల్లో నివసిస్తున్న వారికి ప్రాధాన్యం
- ఒంటరి మహిళలు, వితంతువులకు అవకాశం.
- సొంత ఇంటి జాగా కలిగి ఉండాలి.

ఇంతింతై.. ఎదిగారిలా..!

★ న్యాయవాద వృత్తిలో రాణిస్తున్న మహిళలు



ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మహిళా బార్ అసోసియేషన్ హాల్

ఇతర వృత్తులతో పోల్చితే న్యాయవాద వృత్తి సవాళ్లతో కూడుకుంది. దశాబ్దకాలం క్రితం న్యాయవాద వృత్తిలోకి వచ్చే మహిళలు చాలా తక్కువగా ఉండేవారు. ఇంజినీరింగ్, ఫార్మసీ రంగాలతో పాటు ప్రస్తుతం న్యాయ విద్యపై యువతులు, మహిళలు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా నుంచి న్యాయవాద విద్యను అభ్యసించే వారి సంఖ్య పెరుగుతోంది. ఇంటర్మీడియట్ అయిపోయిన తర్వాత ఐదేళ్ల లాకోర్సు, గ్రాడ్యుయేషన్ అయిపోయినవారు మూడేళ్ల లా కోర్సు చేసి న్యాయవాద వృత్తిలోకి అడుగుపెడుతున్నారు. గతంలో ఆరుగురు న్యాయవాదులు మాత్రమే ఉన్న జిల్లా కోర్టులో ప్రస్తుతం 25 మహిళా న్యాయవాదులు ఉన్నారు. గత నాలుగేళ్ల కాలంలో 15 మందికిపైగా ఈ వృత్తిలోకి వచ్చారంటే ఈ వృత్తిపై పెరుగుతున్న ఆసక్తి తెలుస్తోంది. జిల్లా కోర్టుతో పాటు రామన్నపేట, ఆలేరు, చౌటుప్పల్, యాదగిరిగుట్ట కోర్టులో 10 మంది వరకు ప్రాక్టీస్ చేస్తున్నారు. హక్కులను కాపాడుతూ సామాజిక ఇంజినీర్లుగా భరోసా ఇచ్చేందుకు ఈ వృత్తిలో వచ్చామని, సామాజిక సేవా దృక్పథంగా బాధ్యతలు నిర్వర్తిస్తామని అంటున్నారు ఈ న్యాయవాదులు.

'న్యాయవాదిగా 2001లో భువనగిరి కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నప్పుడు ఇద్దరు మాత్రమే మహిళా న్యాయవాదులు ఉండేవారు.. జిల్లా కోర్టులో ప్రస్తుతం న్యాయవాదులుగా ప్రాక్టీస్ చేస్తున్న మహిళల సంఖ్య చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది.. ఇతర రంగాలతో సమానంగా న్యాయవాద వృత్తిలో మహిళలు ఎదగడం, మగువలకు ప్రత్యేక బార్ అసోసియేషన్ హాల్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం.. ఈ వృత్తిలో రాణించేందుకు ఎప్పటికప్పుడు చట్టాలపై పట్టు సాధించి ఎదగాలి..'

- భువనగిరి కోర్టులో మహిళా బార్ అసోసియేషన్ ప్రారంభం సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తి, జస్టిస్ కె.సుజన అన్న మాటలివి.

భువనగిరి గంజ్, న్యూస్‌టుడే:

అసమానతలు ప్రశ్నించేందుకే

– కె.జయ, ఉపాధ్యక్షురాలు, భువనగిరి బార్ అసోసియేషన్



చిన్నతనంలో వివాహమైనా కుటుంబాన్ని పోషిస్తూ చదువు కొనసాగించా. ఓ స్వచ్ఛంద సంస్థలో ఆర్గనైజర్‌గా పని చేస్తున్న సమయంలో మహిళలపై జరిగే వేధింపులు, అత్యాచార ఘటనలు, ఎస్సీ, ఎస్టీలకు జరిగే సామాజిక అన్యాయం, అసమానతలు ప్రశ్నించేందుకు న్యాయశాస్త్ర విద్యనభ్యసించా. 2009లో న్యాయవాద వృత్తిలో అడుగు పెట్టాను. మహిళలకు అండగా నిలిచేందుకు కృషి చేస్తున్నాను.

నిరంతర కృషి ఉంటేనే

– చందుపట్ల రజని, న్యాయవాది

న్యాయవాద వృత్తిలో పురుషులతో సమానంగా మగువలు ముందుకు వస్తున్నారు. వృత్తిలో ప్రారంభంలో ఇబ్బందులు ఉన్నా రాణించేందుకు నిరంతరం కృషి ఉండాలి. మహిళలు ఇటువైపు వచ్చేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలి. 2005లో న్యాయవాద వృత్తిలోకి వచ్చాను. ఇతర రంగాలతోపాటు గౌరవ ప్రదమైన న్యాయవాద వృత్తిలో వచ్చేవారి సంఖ్య పెరిగింది. చాలా మంది స్త్రీలు తమ హక్కులను తెలుసుకోలేకపోతున్నారు. అలాంటి వారికి అండగా ఉంటాం.

సామాజిక సేవే దృక్పథంగా:

– బి.సుమలత, సఖి కేంద్రం లీగల్ కౌన్సెలర్



వివాహమైన తర్వాత పట్టుదలతో ఎల్‌ఎల్‌బీ పూర్తి చేశాను. 2022లో న్యాయవాదిగా సామాజిక సేవా దృక్పథంలో భువనగిరి సఖీ కేంద్రం లీగల్ కౌన్సెలర్‌గా చేరాను. సఖీ కేంద్రంలో ఆశ్రయం పొందిన వేధింపులు, అత్యాచార బాధితులు, వరకట్న బాధితుల కేసులను వాదిస్తున్నాను. వారితో మమేకమై సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నాను.

మామయ్య ప్రోత్సాహంతో

– చేగూరి సరిత, జూనియర్ న్యాయవాది



ఇంజినీరింగ్ పూర్తి చేశాను. వివాహమైన తర్వాత మా మామయ్య నాగారం అంజయ్య ప్రోత్సాహంతో న్యాయవిద్యను పూర్తి చేశాను. గతేడాది నుంచి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేసేందుకు వస్తున్నాను. అతివల హక్కులు కాపాడేందుకు, వృత్తిలో రాణించేందుకు కృషి చేస్తున్నాను.

వృథాను అరికడదాం.. అభాగ్యుల ఆకలి తీరుద్దాం


మిర్యాలగూడ పట్టణం,సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే:



దుక్కిదున్ని, నారుమడి సిద్ధం చేసి.. విత్తనాలు విత్తితే మొలకెత్తడానికి వారం రోజుల సమయం పడుతుంది. నారు ఎదిగేందుకు.. నాటుకు 25 రోజులు.. ఎరువులు చల్లి.. కలుపు తీసి.. సస్యరక్షణ చేపడితే కొద్ది రోజులకు సన్న వడ్లు చేతికి వస్తాయి.. ఇలా విత్తనం.. వరిగింజగా మారడానికి అన్నదాత 95 రోజులు స్వేదం చిందించి శ్రమించాల్సిందే.

అన్నదాత అంత కష్టపడి.. వర్షాల నుంచి పంటను కాపాడి.. అన్నాన్ని చేతికిస్తే.. శుభకార్యాలు, హోటళ్లలో నిత్యం కిలోల కొద్దీ ఆహారాన్ని వృథాగా పడేస్తున్నారు. మరోవైపు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన పట్టణాలైన నల్గొండ, మిర్యాలగూడ, సూర్యాపేట, కోదాడ, భువనగిరి వంటి పట్టణాల్లో అభాగ్యులు, పేదలు ఆహారం కోసం నిరంతరం అన్వేషిస్తూనే ఉన్నారు. ఇలాంటి వారి ఆకలిని తీర్చడానికి ఐక్యరాజ్య సమితి ఆహార భద్రత కోసం 1945 అక్టోబరు 16న 'ఆహార, వ్యవసాయ సంస్థ'ను ఏర్పాటు చేసింది. ఆ రోజు గుర్తుగా ఏటా మాదిరిగానే బుధవారం జరుపుకొనే 'ప్రపంచ ఆహారం దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం.

★ నేడు 'ప్రపంచ ఆహార దినోత్సవం'



స్వచ్ఛంద సంస్థల కృషి ఇలా..

ఆహార వృథాను అరికట్టేందుకు ఉమ్మడి జిల్లాలో పలు స్వచ్ఛంద సంస్థలు తమ వంతు కృషి చేస్తున్నాయి. టీఎస్‌బీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మిర్యాలగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో మిగిలిన ఆహార పదార్థాలను పెట్టేందుకు ఓ ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. నిర్వహణ సక్రమంగా లేక తొలగించారు. సూర్యాపేటలోనూ ఇదే పరిస్థితి.

★ మిర్యాలగూడకు చెందిన ఆకలి ధృష్టరాయ, అవి రెండ్ల సందీప్ మిత్రబృందాలు, నల్గొండకు చెందిన అమ్మ ఫౌండేషన్ రేఖ, ఆదర్శనందన ఫౌండేషన్ సంజు, చౌటుప్పల్‌కు చెందిన ఆయాన్ బార్గవ్ ట్రస్టు మురళి, సూర్యాపేటకు చెందిన మదర్ థెరిసా ఫౌండేషన్ జానీపాషా తదితరులు ఆహార వృథాను అరికట్టేందుకు శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని సేకరించి పేదలకు పంచుతూ తమ వంతు ప్రయత్నం చేస్తున్నారు.

- ☛ దేశంలో ఒక్కో వ్యక్తి సగటున ఏటా 55 కిలోల ఆహారాన్ని వృథాగా పడేస్తున్నారు.
- ☛ గ్రామీణ ప్రాంతాలతో పోలిస్తే పట్టణ ప్రాంతాల్లోనే ఆహార వృథా అధికం.
- ☛ దేశంలో సుమారు 14.3శాతం మంది తగిన పోషకాలు అందక బాధ పడుతున్నారు.
- ☛ ఐదేళ్లలోపు చిన్నారుల మరణాలకు పోషకాహార లోపమే కారణమని ఐసీఎంఆర్ హెచ్చరించింది.

ఒక్క మెతుకునూ వదిలిపెట్టం

– ధనావత్ శివ, రైతు, మాటూరు, త్రిపురారం మండలం



గత 20 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. ఆరుగాలం శ్రమించి పంటను పండించడం ఎంతో కష్టమైన పని. మేము వ్యవసాయాన్ని దైవంగా భావిస్తూ.. పంటను ఎంతో ప్రేమిస్తాం. కష్టపడి పండించిన ఆహారాన్ని ఇటీవల అనేక మంది వృథా చేస్తుంటే ఎంతో బాధ కలుగుతుంది. మేము అన్నం తినేటప్పుడు కింద ఒక్క మెతుకు పడితే దాన్ని కూడా తీసుకుని కంచంలో వేసుకుంటాం. ఆహార వృథాను కాపాడేందుకు ప్రభుత్వాలు సైతం ప్రత్యేక చర్యలు చేపట్టాలి.

పదేళ్లుగా అన్నదానాలు

–దైద నాగరాజు, మనం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, నార్కట్‌పల్లి



నిత్యం అనేక మంది ఆకలితో అలమటిస్తున్నారు. వారి ఆకలి తీర్చేందుకు గత ఏడేళ్లుగా నార్కట్‌పల్లి, పరిసర ప్రాంతాల్లో అన్నదాన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆరు నెలల క్రితం 'మనం ఫౌండేషన్' పేరుతో స్వచ్ఛంద సంస్థను స్థాపించి నిత్యం వంద మందికి, సంత జరిగే శుక్రవారం 200 మందికి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

కోదాడ, న్యూస్‌టుడే: అపసవ్య దిశలో వెళ్తున్న స్కూటీని డీసీఎం వాహనం ఢీకొనడంతో ఓ యువతి మృతి చెందిన ఘటన పట్టణంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. పట్టణంలోని నయానగర్‌కు చెందిన పలివెల నాగజ్యోతి(18) ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో ఇంటర్ చదువుతోంది. బంధువుల స్కూటీ తీసుకొని పట్టణంలోని హుజూర్‌నగర్ పైవంతెన మీది నుంచి అపసవ్య దిశలో విజయవాడ వైపునకు వెళ్తుంది. అదే క్రమంలో విజయవాడ వైపు నుంచి డీసీఎం వాహనం వచ్చి స్కూటీని ఢీకొంది. ఈ ఘటనలో నాగజ్యోతి తలకు తీవ్ర గాయాలై మరణించింది. తల్లి కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు. యువతి ఒత్తిడిలో ఉన్నట్లు తెలుస్తోందని, దీంతో స్కూటీ మీద అపసవ్య దిశలో వెళ్లి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఆ దిశగా దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

నల్గొండ సంక్షేమం, న్యూస్‌టుడే: పట్టణంలో ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్న సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి తెలిపారు. సయ్యద్ లతీఫ్ ఉల్లా షా ఖాద్రి ఉర్సు ఉత్సవాలపై ఎస్పీ శరత్ చంద్ర పవార్‌తో కలిసి మంగళవారం నల్గొండ కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించేలా ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు అవసరమైన తాగునీరు, శానిటేషన్ వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. 16న ఉర్సు ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 17న గంధం ఊరేగింపు ఉంటుందని చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి సంఘటనలు జరగకుండా శాంతియుతంగా ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ఆర్డీవోలు, డీఎస్పీలు ఉర్సు ఉత్సవాలు పర్యవేక్షించాలన్నారు. ఉర్సు ఉత్సవాలు జరిగే చోట తాగునీరు, శానిటేషన్‌ను నల్గొండ పుర కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి మిషన్ భగీరథ ఎస్ఈలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ మాట్లాడుతూ. . ఉర్సు ఉత్సవాలకు అవసరమైన బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు. సంబంధిత అధికారులు అన్ని అంశాలపై సమగ్రంగా చర్చించి ఉత్సవాలను శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉత్సవాలు జరిగే చోట పార్కింగ్, క్యూలైన్‌ల ఏర్పాటు, బారికేడింగ్ వంటివి ఏర్పాటు చేయాలని, రాత్రి సమయంలో బందోబస్తుకు గార్డులు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ టి.పూర్ణచంద్ర, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, ఇన్‌ఛార్జి ఆర్డీవో శ్రీదేవి, డీఎస్పీ శివరాంరెడ్డి, నల్గొండ పుర కమిషనర్ సయ్యద్ ముసాబ్‌అహ్మద్, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సి.నారాయణరెడ్డి, చిత్రంలో ఎస్పీ శరత్‌చంద్ర పవార్, అధికారులు

ఆర్టీసీకి లాభాల దసరా

సూర్యాపేటలో అత్యధికం.. నార్కట్‌పల్లిలో అత్యల్పం

★ రెండు వారాల్లో రూ. 24.35 కోట్ల ఆదాయం రాక



మిర్యాలగూడ పట్టణం, నల్గొండ గ్రామీణం, న్యూస్‌టుడే:

దసరా పర్వదినం ఆర్టీసీ సంస్థకు లాభాలు తీసుకొచ్చింది. విజయ దశమి సందర్భంగా వివిధ ప్రాంతాల ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చేందుకు ఉమ్మడి జిల్లాలోని ఏడు డిపోల పరిధిలో ఈ నెల 2 నుంచి 646 ప్రత్యేక బస్సులు నడిపారు. ఈ రెండు వారాల్లో మొత్తం 35.19 లక్షల కిలోమీటర్ల దూరం బస్సులు నడపడం ద్వారా ఆర్టీసీ సంస్థ రూ.24.35 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. సాధారణం కంటే రెట్టింపు ఆదాయం రావడంతో అధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దసరా రద్దీ మరో రెండు, మూడు రోజులు కొనసాగనున్న నేపథ్యంలో ఆదాయం మరింత వచ్చే అవకాశం ఉంది.

ఆదాయం సాధించడంలో ఉమ్మడి జిల్లాలో సూర్యాపేట డిపో ప్రథమ స్థానంలో నిలిచింది. రెండు వారాల్లో రూ.4.76కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ఆ తర్వాత దేవరకొండ, మిర్యాలగూడ డిపోలు న్నాయి. నార్కట్‌పల్లి డిపోకు రూ.47.42 లక్షలే వచ్చాయి.

రాష్ట్రంలోనే ప్రథమ స్థానం


రెండు వారాల్లో రీజియన్ వ్యాప్తంగా 117 ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో) నమోదు కాగా.. ఈ నెల 14న అత్యధికంగా 146.12 ఓఆర్‌తో నల్గొండ రీజియన్ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ రోజు రూ.2.26 కోట్ల ఆదాయం సమకూరింది. ఆ రోజు రీజియన్ లక్ష్యం రూ.146.27 కోట్లు కాగా.. రాష్ట్రంలోనే అత్యధికంగా 178 శాతం అదనపు ఆదాయాన్ని సాధించింది.

మహాలక్ష్ములే అధికం..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 36.24 లక్షల మంది ప్రయాణించగా.. వీరిలో మహిళా ప్రయాణికులు 22.1 లక్షలు, డబ్బులు చెల్లించి ప్రయాణించిన వారు రూ. 14.14 లక్షల మంది ఉన్నారు. మొత్తం ఆదాయంలో మహాలక్ష్మి పథకం ద్వారా వచ్చిన రాబడి రూ.11.99 కోట్లు. డబ్బు చెల్లించి ప్రయాణించిన వారి ద్వారా రూ.12.35కోట్ల ఆదాయం వచ్చింది.

అదనపు సర్వీసులు నడిపించడంతో..

– రాజశేఖర్, ఆర్టీసీ ఆర్ఎం, నల్గొండ.



బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. ముందస్తు ప్రణాళికతో రద్దీ అధికంగా ఉండే ప్రాంతాల్లో అదనపు సర్వీసులు నడిపించాం. దీంతో రెండు వారాల్లో రూ.24కోట్లకు పైగా ఆదాయం సమకూరింది.

అక్టోబరు 1 నుంచి 14 వరకు డిపోల వారీగా ఆదాయ వివరాలు..

డిపో	కిలోమీటర్లు	ఆదాయం (రూ.కోట్లలో)	ఓఆర్ (ఆక్యుపెన్సీ రేషియో)
సూర్యాపేట	6,20,302	4.76	126
దేవరకొండ	5,97,579	4.39	122
మిర్యాలగూడ	5,98,473	4.03	109
నల్గొండ	6,54,076	3.94	103
కోదాడ	4,86,022	3.33	111
యాదగిరిగుట్ట	4,95,160	3.40	130
నార్కట్‌పల్లి	67,650	0.47	121

కారు బోల్తా.. యువకుడి దుర్మరణం

యాదగిరిగుట్ట అర్బన్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నుంచి వరంగల్ జాతీయ రహదారిపై కారు బోల్తా పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని పెద్ద కందుకూరు స్టేజీ వద్ద సోమవారం అర్ధరాత్రి చోటు చేసుకంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం దౌలత్ నగర్ గ్రామానికి చెందిన వీరమల్లు వినీత్(17) అతని నలుగురు స్నేహితులతో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తున్నారు. మండలంలోని పెద్ద కందుకూరు స్టేజీ వద్దకు చేరుకోగానే వారు ప్రయాణిస్తున్న కారు అదుపు తప్పి చెట్ల పొదల్లో బోల్తాపడింది. దీంతో వినీత్ అక్కడికక్కడే మృతి చెందగా మిగతావారికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు తండ్రి భిక్షపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రమేష్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కూలీ బలవన్మరణం

భూదాన్‌పోచంపల్లి, న్యూస్‌టుడే: అనారోగ్యం ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరి వేసుకుని వ్యక్తి బలవన్మరణం చేసుకున్న ఘటన పట్టణ కేంద్రంలోని గాంధీనగర్‌లో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన చెక్క యాదయ్య(60) కూలి పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. భార్య చెక్క హంసమ్మ స్థానిక మార్కండేశ్వర స్వామి దేవాలయంలో పని చేస్తుంది. ఉదయం హంసమ్మ పని నిమిత్తం బయటకు వెళ్లగా ఇంట్లో ఎవరూ లేని సమయంలో యాదయ్య ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మధ్యాహ్నం ఇంటికి వచ్చి చూసే సరికి విగత జీవిగా ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

బాలుడిని వెంటాడిన మృత్యువు

★ తమ్ముడిని బస్సెక్కించి వస్తుండగా ఢీకొట్టిన కారు

గరిడేపల్లి, న్యూస్‌టుడే: ఆ బాలుడిని మృత్యువు వెంటాడింది. పది రోజుల క్రితం స్వల్ప గాయాలతో బయటపడినా మంగళవారం కారు రూపంలో కబలించింది. దసరా వేడుకల్లో తోటి స్నేహితులు, బంధువుల పిల్లలతో అప్పటివరకు సరదాగా ఆడుకున్నాడు. తమ్ముడితో కలిసి ఉత్సవాలలో ఆనందంగా గడిపాడు. సెలవులు ముగియడంతో తమ్ముడ్ని పాఠశాలకు పంపే క్రమంలో ప్రమాదంలో మరణించాడు. పోలీసుల వివరాల ప్రకారం.. రాయినిగూడెం గ్రామానికి చెందిన బెక్కం అశోక్, సుష్మలకు శ్రీరాం(11), సాయిరాం కుమారులు. ఇద్దరూ హుజూర్‌నగర్‌లోని ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. బస్సులో వెళ్లి వస్తుంటారు. దసరా సెలవులకు ముందు రోజు హుజూర్‌నగర్ నుంచి తండ్రితో ద్విచక్రవాహనంపై వస్తున్న శ్రీరాం పుస్తకాల బ్యాగు జారిపోతుందని పట్టుకోబోయి కింద పడిపోయాడు. అప్పుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. అనంతరం సెలవులు రావడంతో ఇంటి వద్దే ఉంటూ పండగ జరుపుకొన్నారు. గాయాలు పూర్తిగా తగ్గక పోవడంతో తాను బడికి వెళ్లలేక మంగళవారం ఉదయం తమ్ముడు సాయిరాంను పాఠశాలకు పంపించడానికి అమ్మమ్మ వెంకటలక్ష్మితో కలిసి స్కూల్ బస్సు దగ్గరకు వెళ్లాడు. బస్సు ఎక్కించి అందులోని తన స్నేహితులను పలకరించి వెనుతిరిగి వస్తున్నాడు. రోడ్డు దాటుతుండగా గరిడేపల్లి వైపు నుంచి హుజూర్‌నగర్ వెళ్తున్న కారు వేగంగా శ్రీరాంను ఢీకొట్టింది. దీంతో శ్రీరాం తలకు, కాళ్లకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే హుజూర్‌నగర్‌కు అక్కడి నుంచి కోదాడకు, పరిస్థితి విషమించడంతో ఖమ్మం తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు తెలిపారు. తండ్రి అశోక్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చలిగంటి నరేష్ తెలిపారు.


శ్రీరాం

చికెన్ ధరలు

ఫాంరేటు	126–00
రిటైల్	146–00
డ్రెస్డ్	215–00
స్కిన్‌లెస్	244–00

గింజ పోసుకునే దశలో నేలకొరిగి

○ అన్నదాతను వణికిస్తున్న వర్షాలు


గరిడేపల్లిలో ఏపుగా పెరిగి గింజ పోసుకుంటున్న వరి

గరిడేపల్లి, కోదాడ, న్యూస్‌టుడే:

ఇటీవల వరసగా వస్తున్న అల్ప పీడనాల వల్ల వస్తున్న వర్షాలు అన్నదాతకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. ఏ క్షణంలో గాలి దుమారంతో వర్షం పడుతుందో, పంట నేల పాలవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. ఏటా ఏదో ఒక ప్రాంతంలో వర్షం భారీగా నష్టం మిగుల్చుతుంది. చేతికి వచ్చిన పంట నేలకు ఒరగడంతో చేసిన అప్పులు ఎలా తీర్చాలో.. పెట్టుబడి ఎలా రాబట్టుకోవాలో తెలియక దిగులు పడుతున్నారు.

భారీగా నష్టం: పొలం నేలకొరిగితే భారీగా నష్టం వాటిల్లుతుంది. గింజ పోసుకోక ముందే పడిపోతే 60-70 శాతం, గింజ పోసుకున్న తర్వాత పడితే 30 శాతం దిగుబడి తగ్గుతుంది. దీనికి తోడు వరి యంత్రాలతో కోయిస్తుండటంతో సమయం ఎక్కువగా తీసుకుంటుంది. సాధారణంగా ఎకరం గంట నుంచి గంటా పదిహేను నిమిషాలలో కోస్తే.. పడిపోయిన పొలంలో ఎకరానికి మూడు గంటలకు పైగా సమయం పడుతుంది. అంటే అదనంగా రెండు గంటల సమయం వృథా. అదనపు భారం రూ.ఆరు వేలు. 2022 వానాకాలంలో పొలాలు పడిపోయి భారీగా నష్టం వాటిల్లింది. ఎకరం మూడున్నర గంటల సమయంలో కోశారు. పంట బాగా దెబ్బతింది. ఆ ధాన్యం మిల్లుకు తరలిస్తే అనేక కొర్రీలు పెట్టి క్వింటా రూ. 1,500 నుంచి రూ. 1,800 వరకు కొనుగోలు చేశారు. పొలం పడిపోతే ఎకరానికి రూ.20 వేల నష్టం వాటిల్లుతుంది. అందుకే వానాకాలంలో అకస్మాత్తు వర్షాల తోపాటు గాలులు వీస్తే రైతులకు కన్నీరు వస్తుంది.

రెండు నెలలే కీలకం..

ఏటా వర్షాలు అక్టోబరు మొదటి వారం నుంచి చివరి వారం వరకు కురుస్తున్నాయి. జిల్లాలో ఎక్కువగా వరి పంట చేతికి వచ్చేది నవంబరులోనే. నవంబరు మొదటి వారం నుంచి డిసెంబరు 15 వరకు కోతలు పూర్తవుతాయి. అంటే అక్టోబరు మొదటి వారం నుంచి చివరి వరకు వరి ఈత దశలో కొంత, ముందుగా నాట్లు వేసినవి గింజ పోసుకునే దశలో మరికొంత ఉంటాయి. దాదాపు 80 శాతం పొలాల్లో దీపావళి వెళ్లిన వారం తర్వాత కోతలు మొదలు పెడతారు. పది శాతం మంది అక్టోబరు చివరి వారంలో ఆరంభిస్తారు. అందుకే అక్టోబరు, నవంబరు రెండు నెలల్లో గాలులు, వర్షాలు లేకుంటేనే పంట చేతికి వస్తుంది.

అంతా స్వల్పకాలిక సన్నరకాలే

ఇటీవల రైతులు స్వల్పకాలిక వరి వంగడాలనే సాగు చేస్తున్నారు. ప్రైవేటు రకాలైనా, పరిశోధనా స్థానాల నుంచి తెచ్చినవైనా 120-125 రోజుల పంట కాలం ఉండేవి, అందులోనూ సన్నరకాలు ఎక్కువగా ఉన్నాయి. వేసవిలో ఎండల తీవ్రత, వడగండ్ల వానలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉండటంతో ముందస్తుగానే వానాకాలం పంట ముగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తక్కువ కాలంలో చేతికి వచ్చే పంటలు సాగు చేస్తున్నారు. ఈ రకాలు ఎత్తు ఎక్కువగా పెరుగుతున్నాయి. సాధారణంగా 90 సెం.మీ. పెరిగే వరి అంతగా పడిపోదు. కానీ ఇప్పుడు సాగు చేస్తున్న రకాలు 130 సెం.మీ. వరకు పెరుగుతున్నాయి. దుబ్బులో బలం లేకపోవడం, గట్టి పడకపోవడం, తెగుళ్లు సోకి దుబ్బు మొదలు కర్రలు బలహీనంగా ఉండటంతో గింజ పాలు పోసుకొని ధాన్యంగా మారుతున్నప్పుడు పైన బరువు ఆపలేక పడిపోతున్నాయి. నత్రజని ఎక్కువగా మొక్కకు అందడంతో ఏపుగా పెరిగాయి. ఇటీవల కురుస్తున్న గాలి వానలకు పొలాలు పడిపోతున్నట్లు రైతులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం దెబ్బతిన్న పొలాలు పరిశీలించి పరిహారం ఇస్తే కొంతమేరైనా అన్నదాతకు ఆసరా ఉంటుందని ఆశ పడుతున్నారు.

కోదాడ

• కోదాడ • హుజూర్‌నగర్

మరోసారి అవిశ్వాస తీర్మానానికి ప్రతిపాదన

గరిడేపల్లి, న్యూస్‌టుడే: సర్వారం ప్రాథమిక సహకార పరపతి సంఘం ఛైర్మన్ వీరంరెడ్డి శంభిరెడ్డిపై మరోసారి అవిశ్వాస తీర్మానానికి సభ్యులు డీసీవోకు ఫిర్యాదు చేశారు. తొమ్మిది మంది సభ్యులు ఈ మేరకు సూర్యాపేట జిల్లా సహకార అధికారికి విన్నవించారు. గత ఏడాది సెప్టెంబరులో సైతం అవిశ్వాసానికి ప్రతిపాదించినా చివరి నిమిషంలో వదిలేశారు. పాలకవర్గ సభ్యుల అనుమతి లేకుండా ఎరువుల వ్యాపారం చేస్తున్నాడని, స్వల్పకాలిక రుణాలు సైతం తనకు అనుకూలమైన వారికి మంజూరు చేస్తున్నారని, మాజీ సీఈవో పరశురాములును విధుల్లోకి తీసుకోవాలని పలు ఉత్తర్వులు ఉన్నా ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఉద్యోగంలో చేర్చుకోవడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు.

గోడపత్రిక విడుదల

నేరేడుచర్ల: అసంఘటిత, సంఘటిత రంగాల్లో 14 రాష్ట్రాల్లో పనిచేస్తున్న టీయూసీఐ, ఐఎఫ్‌టీయూ 20న హైదరాబాద్‌లో జరిగే విలీన మహాసభల గోడపత్రికను మంగళవారం నేరేడుచర్లలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు షేక్ సయ్యద్ విడుదల చేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM) 80085 50363 96030 18889

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

? కోదాడ పట్టణంలోని ఖమ్మం క్రాస్‌రోడ్డులో హైమాస్ట్ లైట్లు వెలగడం లేదు. వెంటనే పరిశీలించి లైట్లు వెలిగేలా చూడాలి. – రవి, కోదాడ

✔ పరిశీలించి లైట్లు ఏర్పాటు చేస్తాం. – నాగరాజు, పుర ఎలక్ట్రీషియన్, కోదాడ

బృందాలుగా ఏర్పడి.. టీకాలు వేసి



నేరేడుచర్లలో టీకా వేస్తున్న పశువైద్యశాల ఏడీఏ సత్యనారాయణ

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్లలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని పశువైద్యశాల ఏడీఏ డాక్టర్ కె. సత్యనారాయణ మంగళవారం ప్రారంభించారు. మండల సిబ్బంది మూడు బృందాలుగా ఏర్పడి టీకాలు వేశారు. మండల ఇన్‌ఛార్జి పశువైద్యాధికారి బి. రవినాయక్, సిబ్బంది, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

పాలకవీడు గ్రామీణం: పశువులకు సంక్రమించే గాలికుంటు వ్యాధి నివారణ సకాలంలో టీకాలు అందించడం ద్వారా మాత్రమే సాధ్యమని ఎల్ఎస్ఏ వెంకన్న తెలిపారు. గుడుగుంట్లపాలెంలో టీకాలు అందించి మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల వ్యాప్తంగా నెలరోజుల పాటు టీకాల పంపిణీ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు.

మైదానం.. అధ్వానం

పరిశీలన

మునగాల, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో నైపుణ్యం సాధించడమూ ముఖ్యమే. వారి ఎదుగుదలకు ఇవి ఎంతో దోహదపడతాయి. క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడతాయి. పాఠశాల దశ నుంచే ఆటల్లో నైపుణ్యం కలిగి ఉండటం వల్ల పిల్లలు భవిష్యత్తులో క్రీడా రంగంలో రాణించడానికి సులభతరం అవుతుంది. కొన్ని పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతుంటే, మరికొన్ని చోట్ల అరకొర వసతులతో, అసౌకర్యాల నడుమ కనిపిస్తున్నాయి. దీంతో విద్యార్థులు ఆటలు ఆడలేకపోతున్నారు. మరికొన్ని చోట్ల మైదాన ప్రాంతం చదునుగా లేకపోవడం, పిచ్చి మొక్కలు పెరగడంతో సర్పాలకు నిలయంగా, పశువులు సంచరించడంతో అపరిశుభ్రంగా ఉండి ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

చాలా చోట్ల సమస్యలే..

మండల వ్యాప్తంగా 27 ప్రాథమిక, 02 ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలలు, ఒక కస్తూర్బాగాంధీ, ఆదర్శ పాఠశాల ఉన్నాయి. ఈ పాఠశాలల్లో సుమారుగా 2,500 మంది విద్యార్థులు చదువుతున్నారు. చాలా చోట్ల ప్రహరీ లేకపోవడంతో పశువులు మైదానంలోనే సంచరిస్తున్నాయి. చీకటైతే మైదానాలు మందు బాబులకు అడ్డాలుగా మారుతున్నాయి. చిన్న వర్షం కురిసినా నీరు నిలిచి దయనీయంగా మారుతున్నాయి. అక్కడక్కడా క్రీడా పరికరాలు ఆరగోరగా ఉన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విశాలమైన మైదానం ఉన్నప్పటికీ పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు నిర్వహణ కొరవడి అపరిశుభ్రంగా ఉండి ఆటలకు అనువుగా లేదు. ఆదర్శ పాఠశాల మైదానంలో నిత్యం పశువులు మేత మేస్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి ఆటలు ఆడేలా విద్యార్థులను ప్రోత్సహించాలని, మైదానాలను అనువుగా మార్చాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.



పిచ్చి మొక్కలతో నిండిన మునగాల జడ్పీహెచ్‌ఎస్ మైదానం

సౌకర్యాల కల్పనకు కృషి:

వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారి

ప్రస్తుతం కురిసిన వర్షాలకు మైదానాల్లో పిచ్చి మొక్కలు పెరిగాయి. వాటిని తొలగించాలని ఆయా గ్రామాల కార్యదర్శులను కోరాం. మైదానాల్లో సౌకర్యాల కల్పనకు కృషి చేస్తాం.

ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై అవగాహన

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్లలో మంగళవారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి ఓటర్ల నమోదుపై పీఆర్టీయూ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో



అవగాహన కల్పిస్తున్న నాయకులు

మంగళవారం జడ్పీహెచ్ఎస్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పీఆర్‌టీయూ అభ్యర్థి పి. శ్రీపాల్‌రెడ్డికి తొలి ప్రాధాన్య ఓటు వేయాలని కోరారు. సంఘ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, హెచ్. ఎం. మధు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కె. శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆర్. దీప్లానాయక్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

అద్దె చెల్లించలేదని గురుకుల పాఠశాలలకు తాళం

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: హుజూర్‌నగర్ మైనార్టీ గురుకుల పాఠశాల భవనానికి అద్దె చెల్లించలేదని భవన యజమాని తాళం వేశారు. మంగళవారం జరిగిన ఈ సంఘటనతో దసరా సెలవుల తరువాత వచ్చిన ఉపాధ్యాయులు, విద్యార్థులు బయటే ఉండాల్సి వచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకుల పాఠశాలలకు తాళం వేసినట్లు తెలిసింది. భవనాల యజమానులు సంఘంగా ఏర్పడి తమ అద్దెలు చెల్లించాలని కోరుతూ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు ఇచ్చినా నేటికీ స్పందన లేకపోవడంతో పాఠశాలల భవనాలకు తాళం వేసినట్లు యజమానులు చెబుతున్నారు. హుజూర్‌నగర్ యజమానికి 13 నెలల బకాయి ఉన్నందున వాటిని వెంటనే చెల్లించాలని కోరుతూ తాళం వేశారు. దాదాపు రెండు గంటల పాటు పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది, పిల్లలు బయటనే ఉండాల్సి వచ్చింది. అనంతరం ప్రిన్సిపల్ రెహానాకు వినతిపత్రం ఇచ్చారు.



హుజూర్‌నగర్: పాఠశాల గేటుకు తాళం వేయడంతో బయటే ఉన్న సిబ్బంది, విద్యార్థులు



కోదాడలో చెట్ల కిందే విధులు నిర్వహిస్తున్న ప్రిన్సిపల్ మాధురిశర్మ, ఉపాధ్యాయులు

కోదాడ పట్టణం: పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల భవనానికి భవన యజమాని మంగళవారం తాళం వేయడంతో ఉపాధ్యాయులు చెట్ల కిందే విధులు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాధురిశర్మ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా యజమానులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు యాజమాని ఖాజీం తెలిపారని చెప్పారు. ఏడాదిగా ఈ భవనానికి అద్దె చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. సెలవులు ముగిసి పాఠశాలలు తెరుచుకోవడంతో వచ్చిన విద్యార్థులు, తల్లిదండ్రులు భవనం మూసివేయడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

సమావేశం నిర్వహించి.. సూచనలు అందించి

మునగాల, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శులు రికార్డులను సక్రమంగా నిర్వహించాలని జడ్పీ డిప్యూటీ సీఈవో, మండల ప్రత్యేకాధికారిణి శిరీష అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, మహిళా సమాఖ్య, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించి మాట్లాడారు. మండలంలో ఎల్ఆర్ఎస్‌ను నూరు శాతం పూర్తి చేయాలన్నారు. పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఐదు, ఐకేపీ ఆధ్వర్యంలో మూడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిని ప్రారంభించాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి కమిటీలను ఏర్పాటుచేసి జిల్లా అధికారులకు జాబితా పంపించాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ 2024-25 సంబంధించి లేబర్ బడ్జెట్‌కు అనుగుణంగా ప్రతి గ్రామంలో 300 శాతం పనులకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ, ఇరిగేషన్, పశువర్ధక శాఖ అనుసంధానంతో గుర్తింపును నవంబరు 20లోగా పూర్తి చేయాలన్నారు. ఎంపీడీవో రమేష్ దీన్‌దయాల్ మాట్లాడుతూ డిజిటల్ కార్డుల నేపథ్యంలో కార్యదర్శులు గ్రామాల వారీగా కుటుంబాల వివరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం ఆకుపాములలోని పశువుల వ్యాక్సినేషన్, ప్లాట్లను పరిశీలించారు. తహసీల్దార్ ఆంజనేయులు, మండల వ్యవసాయాధికారి రాజు, ఏపీవో శైలజ, పశువైద్యాధికారి మమత, ఈసీ కళ్యాణ్, సాంకేతిక సహాయకులు, క్షేత్రసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

భాజపా బలోపేతానికి కృషి చేయాలి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: భాజపా బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార



బాలాజీనగర్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్టీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి అనూష

ప్రతినిధి అనూష అన్నారు. బాలాజీనగర్‌లో మంగళవారం భాజపా సభ్యత్వ నమోదును ప్రారంభించి మాట్లాడారు. ప్రతి బూత్‌లో 200 మందికి సభ్యత్వం నమోదు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. భాజపా రాష్ట్ర నాయకురాలు సులోచన, కృష్ణయ్య, జనార్ధన్‌రావు, తదితరులున్నారు.

విద్యార్థి సంఘ మాజీ నాయకుడి మృతికి సంతాపం

హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే: అఖిల భారత విద్యార్థి సమాఖ్య మాజీ నాయకుడు పుట్ట సైదులు(50) అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన భౌతిక కాయంపై వివిధ పార్టీల, సంఘాల నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. సైదులు విద్యార్థుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగన్నగౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల శ్రీనివాస్, ధనుంజయనాయుడు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, మాజీ సర్పంచి రామయ్య, మున్సిపల్ మాజీ ఛైర్మన్ శ్రీనివాస్‌గౌడ్, పాలకూరి బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఖాళీ ప్లాట్లలో.. కొంగల పాట్లు

భూములన్నీ పొలాలు చేశారు. పొలాల్లో ఆహారానికి ఇబ్బందులు ఏర్పడటంతో కొంగలు పట్టణంలోని ఖాళీ ప్లాట్లల్లోకి ఆహారపు వేటకు వచ్చాయి. రెండు, మూడు రోజులుగా పట్టణంలో వివిధ ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లోకి గుంపులుగా కొంగలు వేటకు వస్తున్నాయి. మంగళవారం ఉదయం ఐదు గంటల నుంచి ఆరు గంటల వరకు మాత్రమే ఈ ఖాళీ ప్లాట్లల్లో ఆహారం తిని వెళ్లిపోవడం కన్పించింది. పొలాల్లో పురుగులు ఏరుకుని తినే కొంగలు పట్టణం బాట పట్టాయని పట్టణవాసులు వ్యాఖ్యానిస్తున్నారు. వరుసగా వర్షాలు పడుతుండటంతో పొలాల్లో ఆహారం దొరకక ఇలా పట్టణంలోని ఖాళీ ప్లాట్లకు వచ్చాయని అంటున్నారు.
– హుజూర్‌నగర్, న్యూస్‌టుడే

నీరు.. రోడ్డుపైనే పారు

హుజూర్‌నగర్ నుంచి లక్కవరం, లక్కవరం నుంచి శ్రీనివాసపురం వెళ్లే రహదారిపై పలు చోట్ల రోడ్డు పాడైపోయింది. పలు చోట్ల వ్యవసాయ భూముల్లోంచి వృథాగా వచ్చే నీరు రోడ్డుపై పారుతుంది. దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ రహదారిపై నుంచి హుజూర్‌నగర్, మఠంపల్లి, నేరేడుచర్ల, పాలకవీడు మండలాలకు వాహనదారులు ప్రయాణం చేస్తుంటారు. పలుచోట్ల రహదారి దెబ్బతిని ఈ రోడ్డుపై ప్రయాణం ఇబ్బందిగా మారింది. హుజూర్‌నగర్ నుంచి శ్రీనివాసపురం లక్కవరం లక్కవరం మీదుగా రూ.2.60 కోట్లు మంజూరు అయ్యాయని, టెండర్లు కాలేదని పీఆర్ డీఈ కోక్యా నాయక్ తెలిపారు. కాంట్రాక్టర్లు ముందుకు వస్తే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. –హుజూర్‌నగర్ గ్రామీణం, న్యూస్‌టుడే





దారి ఇలా.. వెళ్లేదెలా?

గ్రామీణ రోడ్ల మరమ్మతులు, ఆధునికీకరణపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం వల్ల గ్రామీణ ప్రాంత ప్రజలు ఇంకా మట్టి రోడ్లపైనే ప్రయాణం సాగించాల్సి వస్తోంది. దిర్శించర్ల నుంచి చిట్టెపువారిగూడెం మీదుగా ముత్యాలమ్మకుంట రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు చినుకుపడితే చిత్తడిగా మారుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఈ రోడ్డును బీటీ రోడ్డుగా మార్చాలని స్థానికులు కోరుతున్నారు. తారు రోడ్డు వేసేందుకు రూ.3.20 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పూర్తయిన తర్వాత పనులు మొదలుపెడతామని పీఆర్ ఏఈ ఎన్. ప్రదీప్ తెలిపారు.
– నేరేడుచర్ల, న్యూస్‌టుడే

'నష్ట పరిహారం చెల్లింపులో వివక్ష తగదు'

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: ఇటీవల వచ్చిన వరదలకు పంట నష్టపోయిన రైతులకు నష్ట పరిహారం చెల్లింపులో వివక్ష తగదని సీపీఎం మండల కార్యదర్శి సైదులు అన్నారు. పలువురు బాధిత రైతులతో మంగళవారం ఆయన మాట్లాడారు. అసలైన అర్హుల బ్యాంకు ఖాతాల్లో ఇంతవరకు నష్ట పరిహారం నగదు జమ అవ్వలేదన్నారు. ప్రభుత్వం అందరి ఖాతాల్లో నగదు జమ అయిందని చెబుతుండగా, ఇక్కడ రైతుల ఖాతాల్లో ఇంకా ఎందుకు జమ కాలేదని ప్రశ్నించారు. అర్హులకు పరిహారం అందకుంటే పోరాటం తప్పదని హెచ్చరించారు.

పంట దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: వర్షంతో వరి పంట దెబ్బతిన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని నేరేడుచర్ల భారాస నాయకుడు రాపోలు నవీన్ డిమాండ్ చేశారు. వైకుంఠాపురంలో పడిపోయిన



పంటను పరిశీలిస్తున్న భారాస నాయకుడు నవీన్, తదితరులు

పున్నమ్మ అనే మహిళా రైతు పొలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఎకరాకు రూ.10 వేలు పరిహారం ఇవ్వాలన్నారు. భారాస నాయకులు మల్లారెడ్డి, రామస్వామి, సత్యనారాయణరెడ్డి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై నిరంతర పోరాటాలు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: అర్ధ శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి చందర్



ఉత్సవాల గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, విద్యార్థులు

రావు కోరారు. హుజూర్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్సవాల గోడపత్రికను మంగళవారం ఆవిష్కరించారు. అక్టోబరు 20న కోదాడలోని ఆర్ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో, 24న ఉస్మానియా యూనివర్సిటీ ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే పీడీఎస్‌యూ ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు. పీడీఎస్‌యూ ఆవిర్భావం నుంచి విద్యార్థి, విద్యారంగ సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిందని ఆయన వివరించారు. జరీనా, మౌనిక, శిరీష, జ్యోతి, సుశీల ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల బంద్



హుజూర్‌నగర్ ప్రియదర్శిని డిగ్రీ కళాశాల గేటుకు తాళం వేసి నిరసన తెలుపుతున్న కళాశాల యాజమాన్యం



కోదాడలో ర్యాలీ నిర్వహిస్తున్న త్రివేణి డిగ్రీ కళాశాల ఛైర్‌పర్సన్ వసంత, అధ్యాపకులు

హుజూర్‌నగర్, న్యూస్‌టుడే: మూడు సంవత్సరాలుగా విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజు రీయింబర్సుమెంటును వెంటనే ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యం ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం పట్టణంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల మూసి వేసి యాజమాన్యం నిరసన తెలిపింది. కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇవ్వాల్సిన ఆర్టీఎఫ్ చెల్లించకపోవడం వల్ల కళాశాలల నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కళాశాలల నిరవధిక బంద్‌కు విద్యార్థులు, తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల న్యూ అరబిందో డిగ్రీ కళాశాల నిర్వాహకులు, అధ్యాపకులు రెండో రోజు కళాశాల బంద్ నిర్వహించి నిరసన తెలిపారు.

కోదాడ పట్టణం: త్రివేణి డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు మంగళవారం కోదాడలో శాంతి ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఛైర్‌పర్సన్ వసంత మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన బకాయిలు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టడంతో కళాశాల నిర్వహణ భారంగా మారిందన్నారు.

కలాంను ఆదర్శంగా తీసుకోవాలి

కోదాడ పట్టణం, న్యూస్‌టుడే: నేటి యువత డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంను ఆదర్శంగా తీసుకోవాలని స్వర్ణభారతి ట్రస్టు గౌరవ అధ్యక్షుడు నీలా సత్యనారాయణ అన్నారు. గాంధీపార్కులో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ట్రస్టు అధ్యక్షుడు శ్రీనివాసరావు, కిట్స్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



అబ్దుల్ కలాంకు నివాళి అర్పించిన అనంతరం విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న సత్యనారాయణ

★ భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని భారాస పట్టణ అధ్యక్షుడు ఎస్.కె. నయీమ్, సీనియర్ నాయకుడు సత్యబాబు అన్నారు. ఆయన విగ్రహానికి నివాళి అర్పించి మాట్లాడారు.

నేరేడుచర్ల: దేశం కోసం పాటుపడిన మహనీయుడు అబ్దుల్‌కలాం అని హెచ్.ఎం. బి. మధు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రామస్వామి, ఇంపాక్టు ఇంటర్నేషనల్ హరివిల్లు అధ్యక్షురాలు వీరవెల్లి శ్రీలత అన్నారు. నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాం జయంతిని పురస్కరించుకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.



నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో..

అంతర్జాతీయ రంగస్థల పోటీలకు ఎంపిక

మఠంపల్లి, న్యూస్‌టుడే: నాగపూర్‌లో 2025 జనవరిలో నిర్వహించే అంతర్జాతీయ రంగస్థల పోటీలకు మఠంపల్లికి చెందిన సీనియర్ కళాకారుడు గుంటి పిచ్చయ్య ఎంపికయ్యారు. విజయనగరంలోని శ్రీవిఘ్నేశ్వర కళా నిలయం ఆధ్వర్యంలో జరిగే సాంస్కృతిక, నాటక పోటీలలో ఏకపాత్రాభినయాల విభాగంలో అశోక చక్రవర్తి పాత్ర పోషించేందుకు తనకు అవకాశం లభించినట్లు పిచ్చయ్య మంగళవారం తెలిపారు. ఇందుకోసం హైదరాబాదులో నాట్య రవళి డాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీలో రెండు రోజులుగా ఎంపిక ప్రక్రియ జరుగుతున్నట్లు ఆయన చెప్పారు. 17 నిమిషాల నిడివిలో వివిధ బాషల్లో ఈ ప్రదర్శనలు ఉంటాయన్నారు. పౌరాణిక, సాంఘిక, జానపదాలలో 66కు పైగా చారిత్రక పురుషుల ఏకపాత్రలు తాను పోషించినట్లు పేర్కొన్నారు.



ఏకపాత్రాభినయం ప్రదర్శిస్తున్న పిచ్చయ్య

కోదండ రామాలయంలో చోరీకి యత్నం

నేరేడుచర్ల, న్యూస్‌టుడే: నేరేడుచర్ల పురపాలికలో తహసీల్ కార్యాలయం పక్కన గల కోదండ రామాలయం గడియ తొలగించి దొంగలు సోమవారం రాత్రి చోరీకి ప్రయత్నించినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ సత్యనారాయణరెడ్డి తెలిపారు. వాచ్‌మెన్ ఆలయం రెండుగేట్లకు తాళం వేసి గదిలో నిద్రిస్తుండగా ఈ ప్రయత్నం జరిగింది. ఉదయం పూజారి ఆలయం తలుపులు తెరవడానికి రాగా చోరీ విషయం తెలిసింది. ఆలయంలో హుండీతో సహా, వస్తువులేమీ పోలేదని ఛైర్మన్ తెలిపారు.

సిబ్బంది నిర్లక్ష్యం.. పడకేసిన పారిశుద్ధ్యం

పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యంతో రామచంద్రాపురంతండాలో మురుగు కాల్వల్లో చెత్తా చెదారాలు పేరుకుపోయి దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంతకాలంగా ఇక్కడి సిబ్బంది ఒకరిపై మరొకరు పైఅధికారులకు ఫిర్యాదులు చేసుకుంటూ విధులకు హాజరు కాకుండా వేతనాలు తీసుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. గ్రామంలో ఉన్న మురుగు కాల్వల్లో పూడిక పేరుకుపోయి దుర్వాసన వస్తోందని దోమలు కుట్టి ఇప్పటికే పలువురు అస్వస్థతతో చికిత్సలు చేయించుకుంటున్నారని చెబుతున్నారు. ఈ విషయాన్ని ఎంపీడీవో, ఎంపీవోల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ప్రత్యేక అధికారి జయచంద్ర స్పందిస్తూ రెండు రోజుల్లో సమస్యను పరిష్కరించాలని కార్యదర్శికి చెప్పామన్నారు. తాను కూడా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటానన్నారు.
– మఠంపల్లి, న్యూస్‌టుడే



సినిమాలు కోదాడ పట్టణం, న్యూస్‌టుడే:

విష్ణురామ్: దేవర, విశ్వం, మా నాన్న సూపర్‌హీరో, వేట్టయన్, జనక అయితే గనక, **శ్రీనివాస:** దేవర, **కాన్‌ప్లెక్స్:** వేట్టయన్, విశ్వం, మానాన్న సూపర్ హీరో, **రంగా:** వేట్టయన్, **వెంకటేశ్వర:** విశ్వం

సంక్షిప్త సమాచారం

నిరసన.. నడిగూడెం: రుణమాఫీ మాట తప్పి రైతులను మోసం చేయాలని చూస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలకు నిరసనగా రైతన్నల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నల్లజెండాలతో నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలుగు రైతు సంఘం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

హర్షం.. మునగాల: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల ప్రమాద నివారణకు సేఫ్టీ మోకులు ఇవ్వడంపై కౌండిన్య గౌడ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజయ్య హర్షం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలో లబ్ధిదారులకు మంగళవారం సేఫ్టీ మోకులను అందజేసి మాట్లాడారు. గౌడ సంఘం రాష్ట్ర నాయకుడు కేఎల్‌ఎన్ ప్రసాద్‌కు సంఘం తరపున కృతజ్ఞతలు తెలిపారు. సంఘం సభ్యులు సీతారాములు, రాములు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మొదలైన గండి పూడ్చివేత పనులు

మేళ్లచెరువు, న్యూస్‌టుడే: మేళ్లచెరువులో నాగుల చెరువు కట్ట గండి పూడ్చివేత పనులు మొదలయ్యాయి. ఇందుకుగాను రూ.83 లక్షలు మంజూరైన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ మధ్యనే పనులను చేపట్టారు. ఈ పనులు నిదానంగా జరుగుతున్న నేపథ్యంలో.. మొత్తం కట్ట పటిష్ఠం చేయకుంటే మళ్లీ గండిపడే ప్రమాదం ఉందని స్థానిక రైతులు హెచ్చరిస్తున్నారు. దీంతో పాటు చెరువు లోపల వైపు కట్ట కోతకు గురవ్వకుండా రాళ్లతో రివిట్‌మెంటు వాల్ ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. గండిని పూడ్చిన అనంతరం చెరువు కట్ట పటిష్ఠ పనులు చేపడతామని అధికారులు అంటున్నారు. రైతుల సూచనలకూ ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు.



చెరువు కట్టను రోలర్‌తో చదును చేస్తున్న దృశ్యం

సూర్యాపేట

• సూర్యాపేట • తుంగతుర్తి

'భగీరథ' సరఫరాపై దర్యాప్తు

నూతనకల్: నూతనకల్‌లో మిషన్ భగీరథ మంచినీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్ క్వాలిటీ కంట్రోల్ ఏఈ వెంకటరెడ్డి మంగళవారం క్షేత్ర పరిశీలన చేసి దర్యాప్తు చేపట్టారు. భగీరథ మంచి నీటి సరఫరా కోసం గ్రామ పంచాయతీ ఉపయోగిస్తున్న ఏడు రకాల రిజిస్టర్లను పరిశీలించారు. నీటి ట్యాంకు పైకి ఎక్కి నీటిని సేకరించి నాణ్యతను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్‌కుమార్, గ్రిడ్ ఏఈ అశోక్, రమేష్, కారోబార్ శంబయ్య, యల్లయ్య, మధు, బాబు, అబ్బుల్ల తదితరులు పాల్గొన్నారు.

భక్తులకు మంచి నీళ్లు అందిస్తా

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనారసింహ స్వామి దేవాలయంలో మంచి నీళ్ల లేక ఇబ్బందులు పడుతున్నారని భక్తులు



శ్రీయోగానంద లక్ష్మీనారసింహస్వామి ఆలయంలో బోరు వేయిస్తున్న రేఖ

తన దృష్టికి తీసుకొచ్చారని రేఖా చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ బోయపల్లి రేఖ తెలిపారు. దేవాలయంలో మంగళవారం ఆమె ట్రస్ట్ ఆధ్వర్యంలో బోరు వేయించారు. నీళ్లు మంచిగా పడటంతో బోరు మోటారు వేసి ఒక ట్యాంక్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ఆలయ ప్రాంగణంలో మంచి నీటిశుద్ధి ప్లాంటును ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. వీటికి సుమారు రూ.1.20 లక్షలు ఖర్చు అవుతుందని చెప్పారు. బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనిరెడ్డి రాజేందర్ రెడ్డి, యువజన సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వెల్దుల రమేష్, మద్ది పద్మ, మామిడి పుల్లయ్య, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు కదారి రాంబాబు, మనోహర్, కోటి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

సూర్యాపేట పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు, బీఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షుడు వీరవెల్లి సోమిరెడ్డి హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో మంగళవారం పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, ఏఐసీసీ పరిశీలకులు దీపా దాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న ఉన్నారు.

> భానుపురి, న్యూస్‌టుడే:
>
> ? సూర్యాపేటలోని శ్రీశ్రీనగర్‌లో వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రి అంధకారం నెలకొని కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వెంటనే చర్యలు చేపట్టాలి. – పాపయ్య, శ్రీశ్రీనగర్
>
> ✔ పరిశీలించి వెలిగేలా చూస్తాం. – తిరుమలయ్య, పుర ఏఈ, సూర్యాపేట

> తిరుమలగిరి, న్యూస్‌టుడే:
>
> ? వర్షాల కారణంగా తిరుమలగిరి పురపాలికలోని రెండో వార్డులో జడ్పీ ఉన్నత పాఠశాల పక్కవీధిలో రోడ్డుపైన ఉన్న ఇసుక మురుగుకాల్వల్లో పడి నిండుతుంది. – జి.సోమయ్య, తిరుమలగిరి
>
> ✔ వెంటనే సిబ్బందిని పంపి ఇసుక తీయించి కాల్వలు శుభ్రం చేయిస్తాం. – ఎం.బుచ్చిబాబు, ఇన్‌ఛార్జి కమిషనర్, తిరుమలగిరి పురపాలిక

> సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే:
>
> ? సూర్యాపేటలోని విద్యానగర్‌లో నీటిసరఫరా సరిగా జరగటం లేదు. దీంతో కాలనీవాసులు నీటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. – రమేష్, విద్యానగర్
>
> ✔ సిబ్బందికి చెప్పి సరఫరా జరిగేలా చూస్తాం. – శ్రీనివాస్, పుర కమిషనర్, సూర్యాపేట

ప్రకృతి వనం.. ఆహ్లాదం ఘనం

'పేట'లో చిట్టడవులను తలపిస్తున్న పట్టణ ప్రకృతి వనాలు

సూర్యాపేట పట్టణంలో పట్టణ ప్రకృతి వనాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ప్రస్తుతం ఏపుగా మొక్కలు పెరిగి చిట్టడవులను తలపిస్తున్నాయి. వీటిని చూసిన ప్రతి ఒక్కరూ కాసేపు సేదతీరుతున్నారు. రెండేళ్ల క్రితం పట్టణంలో పుర అధికారులు పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వాటిలో మొక్కలు నాటి పెరిగేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా వనాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి.

– భానుపురి, న్యూస్‌టుడే



సూర్యాపేట పురపాలిక పరిధిలోని దురాజ్‌పల్లి పట్టణ ప్రకృతి వనం

ఎక్కడెక్కడంటే..

సూర్యాపేటలో 49 పట్టణ ప్రకృతి వనాలను పుర అధికారులు ఏర్పాటు చేశారు. పట్టణంలోని కుడకుడ, దురాజ్‌పల్లి, ఇందిరమ్మ కాలనీ, గాంధీనగర్, గిరినగర్, పిల్లలమర్రి, రాయినిగూడెం, ఆర్.కె. గార్డెన్స్, ఎన్టీఆర్ కాలనీ, శాంతినగర్, వస్త్రాంతండా తదితర కాలనీల్లో పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. వీటి సంరక్షణకు ప్రత్యేకంగా సిబ్బందిని నియమించారు. ఎప్పటికప్పుడు మొక్కల సంరక్షణ చూస్తున్నారు. వేసవిలోనూ ఎండిపోకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని అందించారు.

పెంచుతున్న మొక్కలివి..

ఈ వనాల్లో నేరేడు, పారిజాతం, కానుగు, మర్రిచెట్టు, టేకుచెట్లు, నల్లమద్దీ, విప్పపువ్వు, రామసీతాఫలం, తదితర మొక్కలను పెంచుతున్నారు. ఈ మొక్కలన్నీ ప్రస్తుతం పెద్దగా పెరిగాయి. ఈ వనంలో మొక్కలకు ప్రత్యేక పాదులు, బాట ఏర్పాటు చేశారు. చుట్టూ కలియతిరిగేలా కంకరపోసి దారులు ఏర్పాటు చేశారు. ప్రతి భాగానికి నీటి పైపులు అమర్చారు. చెట్ల మధ్య పెరిగిన కలుపు మొక్కలను సిబ్బంది ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.

వేసవిలో ఎండిపోకుండా చూశాం..

– శ్రీనివాస్, పుర కమిషనర్

ఈసారి వేసవిలో ఎండలు మండిపోయాయి. పట్టణ ప్రకృతి వనాల్లో నాటిన మొక్కలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందించి ఒక్కమొక్క కూడా ఎండిపోకుండా చూశాం. ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ఏపుగా పెరిగి ఆహ్లాదంగా మారాయి. సిబ్బంది పిచ్చిమొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు.

అల్లుడిపై గొడ్డలితో మామ దాడి

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: అల్లుడిపై తన మామ గొడ్డలితో దాడి చేసిన ఘటన మండల పరిధిలోని యండ్లపల్లిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.... కేతేపల్లి మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన నవీన్‌తో యండ్లపల్లి గ్రామానికి చెందిన శ్రావణితో వివాహం జరిగింది. వారికి కుమారుడు కాగా, ప్రస్తుతం ఆమె గర్భిణి కావడంతో రాఖీ పండగ రోజున పుట్టింటికి వెళ్లింది. తిరిగి దసరా తర్వాత ఆదివారం ఆమెను తీసుకెళ్లేందుకు వెళ్లిన నవీన్‌పై మామ బుడిగె జానయ్య గొడ్డలితో దాడి చేశాడు. దీంతో తీవ్ర గాయాలైన నవీన్‌ను వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఇబ్రహీంపట్నం సర్కిల్ పరిధిలోని గ్రీన్ పార్కసిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆకులమైలారం గ్రామంలో బంగారం దొంగతనం చేసిన నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం కేసు వివరాలు ఇబ్రహీంపట్నంలో ఏసీపీ రాజు.. పార్కసిటీ పోలీస్‌స్టేషన్ సీఐ కృష్ణంరాజు, ఎస్‌ఐ తేజంరెడ్డి, క్రైం పోలీసులతో కలిసి వెల్లడించారు. ఈనెల 10న కందుకూరు మండలం ఆకులమైలారం గ్రామానికి చెందిన వృద్ధురాలు దేవరశెట్టి సుమతమ్మ ఒంటరిగా ఇంట్లో ఉన్న సమయంలో సూర్యాపేట జిల్లా రామన్నగూడెంకు చెందిన పుటుకూరి ప్రభాస్(20), నల్గొండ జిల్లా శాలిగౌరారానికి చెందిన గుండెపల్లి శివ(19) లోపలకు ప్రవేశించారు. వృద్ధురాలి మెడలో ఉన్న 6 తులాల బంగారు గొలుసు, చేతి గాజులు కత్తిరించి దోపిడీ చేశారు. సీఐ కృష్ణంరాజు, ఎస్ఐ తేజంరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. నిందితులను పట్టుకున్నారు. నిందితుల నుంచి 6 తులాల బంగారు నగలు, కారు, ఐ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. ప్రభాస్ బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. శివ మెడికల్ దుకాణంలో పని చేస్తున్నాడు. ఇద్దరూ ఆన్‌లైన్ బెట్టింగ్‌లో అప్పులపాలయ్యారు. హయత్‌నగర్ కోహెడ గ్రామంలో కారు అద్దెకు తీసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది.

యువకుడి అదృశ్యం



పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: యువకుడు అదృశ్యమైన ఘటన మండలంలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో మంగళవారం వెలుగు చూసింది. ఎస్సై రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యువకుడు పచ్చిపాల లింగరాజు ఈనెల 13న దివ్వెల మండలం తిమ్మాపురం అత్తగారింటికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరాడు. ఇప్పటివరకు అత్తగారింటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు అతని కోసం బంధువుల ఇళ్లలో వెతికినప్పటికీ ఆచూకీ లభించలేదు. దీంతో లింగరాజు తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

తిరుమలగిరి, న్యూస్‌టుడే: సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయక ప్రభుత్వం విద్యావ్యవస్థను నిర్లక్ష్యం చేస్తుందని ప్రిన్సిపల్ ఎర్ర నాగయ్య ఆరోపించారు. మంగళవారం తిరుమలగిరిలో ప్రగతి డిగ్రీ కళాశాల గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్లు నల్ల నర్సయ్య, అధ్యాపకులు వెలుగు సైదులు, సత్యనారాయణ, శ్రీనివాస్, సుధాకర్, కిరణ్, ఓంకార్, కృష్ణ, యాకయ్య, వెంకన్న, సత్యం, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న డిగ్రీ కళాశాల సిబ్బంది

'హిందూ ఆలయాలపై దాడులను ఖండిస్తున్నాం'



సూర్యాపేట కనకదుర్గా ఆలయంలో మాట్లాడుతున్న హిందూ ఐక్య సంఘాల నాయకులు

సూర్యాపేట సాంస్కృతికం, న్యూస్‌టుడే: హిందువుల మనోభావాలు దెబ్బతినేలా ప్రవర్తిస్తున్న శక్తులను కఠినంగా శిక్షించాలని హిందూ ఐక్య సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయంలో నిర్వహించిన సమావేశంలో మంగళవారం పాల్గొని మాట్లాడారు. అమ్మవారి నవరాత్రి ఉత్సవాల్లో హిందూ వ్యతిరేక శక్తులు అపచారాలకు పాల్పడటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో దుర్గామాత, సికింద్రాబాద్ ముత్యాలమ్మ విగ్రహాలపై జరిగిన దాడులు హిందువులకు ఆవేదన కలిగించిందన్నారు. సమావేశంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు శ్రీ కొలిగింగల ఉపేందర్, బజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు తోనుకునూరు సంతోష్, పర్యతం శ్రీధర్, కేశవులు, కిరణ్, విజయకృష్ణ, సూరయ్య, సతీష్, సందీప్, సోమయ్య, తేజ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులానికి తాళం

తుంగతుర్తి, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల భవనానికి ఏడాది కాలంగా అద్దె చెల్లించటం లేదని గేటుకు తాళం వేశారు. మంగళవారం గురుకుల పాఠశాల పునఃప్రారంభానికి ముందే సిబ్బంది వచ్చారు. అప్పటికే యజమాని బత్తుల లాలయ్య గేటుకు తాళం వేసి ఎవరినీ లోనికి వెళ్లనివ్వలేదు. మధ్యాహ్నం రెండు గంటలు దాటిన తర్వాత భవన యజమానులు సంఘం ఆదేశం మేరకు తాళం తీయటంతో సిబ్బంది లోనికి వెళ్లారు.



పాఠశాలకు తాళం వేసి సిబ్బందితో మాట్లాడుతున్న భవన యజమాని లాలయ్య

పశువులకు టీకాలు వేయించండి

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: పశువులకు వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ నరేష్ సూచించారు. ఉచిత వైద్య శిబిరంలో భాగంగా మంగళవారం వెలుగుపల్లిలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలను వేశారు. బుధవారం, గురువారం సైతం శిబిరాన్ని గ్రామంలో నిర్వహిస్తున్నామన్నారు. రైతులు వెంకన్న, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల గ్రామీణం: మండలంలోని పశువుల కాపరులు ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారిణి సుష్మిత సూచించారు. మంగళవారం రెడ్డిగూడెంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసి మాట్లాడారు. వెటర్నరీ అసిస్టెంట్ ప్రమీల, గోపాలమిత్రలు నాగెల్లి శ్రవణ్‌కుమార్, లింగమూర్తి, పాల్గొన్నారు.

పెన్‌పహాడ్, న్యూస్‌టుడే: రైతులు ముందు జాగ్రత్తలు పాటించి పశుసంపదను సంరక్షించుకోవాలని మండల పశువైద్యాధికారి వెంకన్న సూచించారు. మండలంలోని దుబ్బతండాలో పశువులకు మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసి రైతులకు సూచనలందించారు. వివిధ గ్రామాల గోపాలమిత్రలు పాల్గొన్నారు.

'దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్న కేంద్రం'



నెమ్మికల్‌లో మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: దేశంలో మోదీ ప్రభుత్వం ప్రజల సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతుందని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి ఆరోపించారు. ఆత్మకూర్(ఎస్) మండలంలోని నెమ్మికల్ ఎస్ఎన్ ఫంక్షన్ హాల్లో మంగళవారం నిర్వహించిన పార్టీ మండల 8వ మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేంద్రంలోని భాజపా, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి పెద్దలకు అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ పేదలను విస్మరిస్తున్నట్లు విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చలేదన్నారు. ఆత్మగౌరవ నిరుపేదలకు వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12వేలు, ఇందిరమ్మ ఇళ్లు, విద్యా, ఉద్యోగ నియామకాలు ఇస్తామని ఈ నాటికి నెరవేర్చలేదని దుయ్యబట్టారు. రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ సభ్యులు బెల్లంకొండ వెంకటేశ్వర్లు, నూకల గిరిప్రసాద్‌రెడ్డి, గోలీ భాగ్యమ్మ సభకు అధ్యక్షవర్గంగా వ్యవహరించారు. మండల కార్యదర్శి అవిరె అప్పయ్య మండలంలో గడచిన మూడేళ్లలో పార్టీ చేపట్టిన ప్రజా పోరాటాల నివేదికను ప్రవేశపెట్టారు. అంతకుముందు అనారోగ్యంతో అమరులైన కేంద్రం నాయకులు సీతారాంఏచూరి, మల్లు స్వరాజ్యం, బుద్ధదేవ్ భట్టాచార్యలతోపాటు స్థానికంగా పలువురికి సంతాపం ప్రకటించి నివాళులు అర్పించారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, జిల్లా కమిటీ సభ్యుడు దుండ వెంకటరెడ్డి, బెల్లంకొండ చక్రయ్య, వేల్పుల వెంకన్న, చిన్నపంగి నర్సయ్య, సానబోయిన ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం జెండా పేదలకు అండ

చివ్వెంల, న్యూస్‌టుడే: పేదల పక్షాన పోరాడేది ఎర్రజెండా ఒక్కటేనని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వల్లభాపురంలో బూషయ్య అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన పార్టీ మహాసభలో ఆయన మాట్లాడారు. పెరుగుతున్న ధరలు, నిరుద్యోగ సమస్య, పేదరికాన్ని అదుపు చేయలేని పరిస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని ఆరోపించారు. ధరల పెరుగుదలకు నిరసనగా సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు అన్ని మండల, పట్టణ కేంద్రాల్లో ఈనెల17 నుంచి నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మాజీ మండల కార్యదర్శి పల్లెటి వెంకన్న ఆధ్వర్యంలో పలువురు సీపీఎంలో చేరారు. జిల్లా కమిటీ సభ్యుడు వేల్పుల వెంకన్న, మండల కార్యదర్శి బచ్చలకూర రాంచరణ్, సోమయ్య, అబ్రహం, నాగయ్య, రాములు, తిర్పమ్మ తదితరులు పాల్గొన్నారు.



వల్లభాపురంలో మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

ఆటపాటలతో అవగాహన

జాజిరెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాల నిషేధం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని తెలంగాణ సాంస్కృతిక



కోటపల్లిలో కళా ప్రదర్శన చేస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల బృందం

సారథి జిల్లా అధ్యక్షుడు వెన్నెల నాగరాజు అన్నారు. కోమటిపల్లి గ్రామంలో మంగళవారం ఆటా-పాటా కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పరిరక్షణ, గంజాయి నియంత్రణ, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు ఆటా-పాటలతో అవగాహన కల్పించారు. బృంద నాయకుడు ఈర్ల సైదులు, మేడిపల్లి వేణు, శ్రీకాంత్, ఉపేందర్, మంజుల, మాగి శంకర్, ఉదయ్, శిరీష, ప్రవంతి, రాధ పాల్గొన్నారు.

ప్రతిభ యువజన సంఘం కార్యవర్గం ఎన్నిక

నాగారం, న్యూస్‌టుడే: ఈటూరు గ్రామంలో మంగళవారం ప్రతిభ యువజన సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పేరాల గోపి, ఉపాధ్యక్షుడిగా బొడ కళ్యాణ్, ప్రధాన కార్యదర్శిగా అనిలాజ్యం, కోశాధికారిగా మహేశ్, సాంస్కృతిక కార్యదర్శిగా దయానంద్, క్రీడల కార్యదర్శిగా జగదీశ్ ఎన్నికయ్యారు.

మురుగు నిలిచి.. దుర్వాసన వచ్చి

సూర్యాపేటలోని 16వ వార్డులో ఇటీవల కురిసిన వర్షానికి ఖాళీ స్థలంలో నీరు నిలిచింది. ప్రస్తుతం నల్లగా మారటంతో దుర్వాసన వస్తోంది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నీరుపోవే మార్గం లేకపోవడంతో దోమలకు నిలయంగా మారి వృద్ధిచెంది రాత్రి పూట కుడుతు బాధలు చేస్తున్నాయి. ఇళ్ల మధ్యన మురుగు నిల్వ ఉండటంతో దోమల మోత భరించలేకపోతున్నారు. దోమల నివారణ ఆయిల్ బాల్స్ వేయాల్సి ఉన్నా దోమలు పట్టుకున్న వ్యవహరిస్తున్నారు. పుర కమిషనర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా పరిశీలించి మురుగు పారే మార్గం చూస్తామని తెలిపారు.

– న్యూస్‌టుడే, భానుపురి



రోడ్లపైనే వ్యాపారం



సూర్యాపేట పట్టణంలోని కుడకుడ రోడ్డులో రహదారిపై వివిధ వ్యాపారాలు సాగిస్తున్నారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ రహదారి నుంచి వరంగల్, మహబూబాద్, ఇతర ప్రాంతాలకు నిత్యం వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతోపాటు వ్యాపార సముదాయాలు కూడా ఎక్కువ సంఖ్యలో ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటోంది. దీంతో ప్రయాణికులు దారి మళ్లించుకుని నరకయాతన పడుతున్నారు. సాయంత్రం పూట రద్దీతో కిక్కిరిసిపోవడంతోపాటు రోడ్లపైనే వివిధ వ్యాపార నిర్వహణ చేపట్టడంతో పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాలు దారి మళ్లే పరిస్థితి లేకుండా ఉంటోంది. దీనిపై పుర కమిషనర్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. వ్యాపారులతో మాట్లాడి రోడ్లపై నిర్వహించకుండా చూస్తామని తెలిపారు.

– సూర్యాపేట పురపాలిక, న్యూస్‌టుడే

కుంగిన కల్వర్టు.. ప్రమాదకరంగా రహదారి..!



జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్డు సమీపంలోని నాలా వద్ద రహదారి ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఎగువ నుంచి వరద తాకిడికి కల్వర్టు కోతకు గురైంది. దీంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వెంట సర్వీసు రోడ్డు కుంగిపోయింది. నూతన కలెక్టరేట్ నుంచి ఖమ్మం క్రాస్ రోడ్డు వైపు వెళ్లే దారులు, సూర్యాపేట నుంచి ఖమ్మం వెళ్లే వాహనాలు సైతం ఇదే దారిలో వెళ్లాల్సి ఉంటుంది. వాహనదారులు పొరపాటున అటు వైపు(కోతకు గురైన ప్రాంతం) వెళ్తే కల్వర్టులో పడిపోయే ప్రమాదం ఉంది. ఇటీవల అధికారులు కోతకు గురై ప్రమాదకరంగా మారిన ప్రాంతాన్ని సందర్శించి అంచనాలు మాత్రమే రూపొందించారు. మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.

– సూర్యాపేట(తాళ్లగడ్డ), న్యూస్‌టుడే

నిత్యం.. బురదమయం

మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రాంతంలో నెమ్మికల్ వెళ్లే రహదారి నిత్యం బురదమయంగా మారటంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఎగువ నుంచి వచ్చే మురికి కాలువను ఇక్కడ అసంపూర్తిగా వదిలేయడంతో వచ్చే నీరంతా రోడ్డుపై పారుతోంది. దీనితోడు ఇక్కడ గేట్‌వాల్వ్ లీకేజీ ద్వారా వచ్చే వృథానీరు సైతం మురికినీటితో కలుస్తోంది. పలుచోట్ల ప్రతిరోజు రహదారిపై బురద విస్తరిస్తుంది. దీనిపై పంచాయతీ కార్యదర్శి సుధాకర్ వివరణ కోరగా.. 'గతంలో రహదారి విస్తరణలో భాగంగా మురికికాలువ నిర్మించిన గుత్తేదారు అసంపూర్తిగా వదిలేయడంతో సమస్య తలెత్తింది. కాలువ పూర్తిస్థాయిలో నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని, గేట్‌వాల్వ్ లీకేజీకి మరమ్మతు చేయిస్తామని' తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆత్మకూర్(ఎస్)



వ్యవసాయ మార్కెట్ ధరలు

భానుపురి, న్యూస్‌టుడే: సూర్యాపేట వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం వచ్చిన వివిధ పంట ఉత్పత్తులకు పలికిన గరిష్ఠ, కనిష్ఠ ధరల వివరాలు(రూపాయల్లో).

రకం	గరిష్ఠం	కనిష్ఠం
బీపీటీ	2959	1656
జైశ్రీరాం	3129	1989
ఐఆర్-64	1976	1766
హెచ్ఎంటీ	2819	1856
కందులు	7219	3849
పెసర	7493	2559
వేరుసెనగ	7109	3359
మొక్కజొన్న	1925	1609

శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

తుంగతుర్తి, న్యూస్‌టుడే: నల్గొండ-ఖమ్మం-వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీఆర్‌టీయూ అధికారిక అభ్యర్థి పింగిలి శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గుజ్జ భాస్కర్, ఉపాధ్యాయులను కోరారు. మంగళవారం సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటరు నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జాటోత్ రాజన్న, ఆసాబాద చంద్రశేఖర్, గోపగాని ఓంప్రకాష్, జిల్లా బాధ్యులు శ్రీరాములు, శ్రీనివాస్, సుధీర్‌రెడ్డి, రమేషర్ పాల్గొన్నారు.

తప్పించుకు తిరుగుతున్న నేరస్థుడి అరెస్టు

అడ్డగూడూరు, న్యూస్‌టుడే: శిక్షపడిన నేరస్థుడు బెయిల్‌పై బయటకొచ్చి గత మూడేళ్లుగా తప్పించుకు తిరుగుతుండగా పట్టుకొని రామన్నపేట కోర్టులో మంగళవారం హాజరుపరిచినట్లు ఎస్సై డి.నాగరాజు వివేకరులకు తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వెల్దేవికి చెందిన గోలి శంకర్‌పై 2020లో ఓ పంచాయతీ విషయంలో అప్పటి ఎస్సై కేసు నమోదు చేసి భువనగిరి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం కోర్టు రెండేళ్ల శిక్ష విధించగా, పై కోర్టులో అప్పీలు చేసుకొని బెయిల్‌పై బయటకొచ్చాడు. మూడేళ్లుగా తప్పించుకొని తిరుగుతుండటంతో ఎస్సై డి.నాగరాజు ఆదేశానుసారం హెడ్‌కానిస్టేబుల్ రామనర్సయ్య, కానిస్టేబుల్ రజనీకాంత్‌లు పక్కా సమాచారంతో నేరస్థుడిని హైదరాబాద్‌లో పట్టుకొని స్థానిక స్టేషన్‌కు తీసుకువచ్చి కోర్టులో హాజరుపరిచినట్లు వివరించారు.

ఆర్థికసాయం అందజేత

తుంగతుర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గొట్టిపర్తి గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యుడు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మందుల సామేల్ రూ.5వేలను పంపగా పార్టీ కార్యకర్తలు మృతుని కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశారు. గ్రామశాఖ అధ్యక్షుడు చిలుకల వెంకన్న, మండల ఉపాధ్యక్షుడు చింత కుంట్ల వెంకన్న, కోతి శ్రీను, శివసాయి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కలాం జీవితం.. దేశసేవకే అంకితం

తిరుమలగిరి, న్యూస్‌టుడే: మాజీ రాష్ట్రపతి దివంగత ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి వేడుకలను మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి భానునాయక్ అబ్దుల్‌కలాం దేశరక్షణ రంగానికి చేసిన కృషిని వివరించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ శ్రీనివాస్, జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీనివాస్, జానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్(ఎస్), న్యూస్‌టుడే: మండలంలోని నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డా.ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ దార పాండయ్య, ఏజీఎంసీ వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్ సంఘం జిల్లా కార్యదర్శి హమీద్‌ఖాన్, సీహెచ్.గోవర్ధన్, నాగార్జున, లక్ష్మయ్య, దశరథ, మహేష్, నరేష్, మమత, సునీత, మరియా, సరిత, తదితరులు పాల్గొన్నారు.



నెమ్మికల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు